క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

● సీఎం కప్‌కు..

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్–2024 కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న క్రీడా పోటీల్లో పాల్గొన్నే క్రీడాకారులు వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ రవీందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని, ఈ పోటీలను ఈ నెల 7, 8న జీపీ పరిధిలో, 10, 12న మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు తమ ఆధార్ కార్డు, పుట్టిన తేదీ, ధ్రువీకరణ పత్రాలతో https://cmcup2024.telangana.gov.in సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

● పీఈటీ పోస్టుకు..

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల కాలేజీలో పీఈటీ పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ఎస్‌ఓ లత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన మహిళా అభ్యర్థులు డిగ్రీతో పాటు బీపీఈడీ అర్హత కల్గి ఉండాలని, తాత్కాలిక ప్రాతిపదికన ఈ విద్యాసంవత్సరానికి గాను 4 నుంచి 5వ తేదీ వరకు కస్తూర్బా కళాశాలలో తమ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఎస్‌ఓ సూచించారు.

'సర్వజ్ఞ' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. మంగళవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుహానా ఆరోషి, అక్షితరెడ్డిలతో పాటు మరో 40 మంది విద్యార్థులు మెరిట్ అవార్డు సాధించగా 80 మందికి గుడ్ పెర్ఫామెన్స్ అవార్డు అందుకున్నారన్నారు.

రిఫ్రిజిరేటర్ వితరణ

కామేపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుల సౌకర్యార్థం ఊట్కూర్ గ్రామానికి చెందిన అనిచిన్ని ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త నరసింహారావు రూ.12 వేలు విలువ చేసే రిఫ్రిజిరేటర్‌ను మంగళవారం వ్యవసాయాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ భూక్యా తారాదేవి, ఏఈఓ శ్రీకన్య, రైతులు ములకలపల్లి నాగయ్య, ముత్తబోయిన రాంమూర్తి, కొమ్మినేని భద్రయ్య, దీవెల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం అభినందనీయం



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న కళావతిభాయి

ఖమ్మం సహకారనగర్: కొణిజర్లకు చెందిన బి.ఫార్మసి విద్యార్థిని పందిళ్ల ఉషారాణికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అందించిన రూ.20 వేల చెక్కును డీఎంఅండ్‌హెచ్‌ఓ కళావతిభాయి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ప్రతీ సంవత్సరం రూ.20వేలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ సైదులు, ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, విద్యార్థిని తల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రోటీ కపడా రోమాన్స్
వినోద	భైరతి రణగల్
సాయిరాం	మెకానిక్ రాకీ
ఆదిత్య	కంగువ
శ్రీనివాస	అమరన్
సినీ గెలాక్సీ	జీబ్రా

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	60	బచ్చలికూర	3
వంకాయ	28		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	34	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	64	తోటకూర	3
దొండ	30		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	58		20
గోరుచిక్కుడు	38	మెంతికూర	2
క్యాబేజీ	34		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	38		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	68		25
క్యాప్సికం	54	-ఖమ్మం వ్యవసాయం	

రైతుబజార్‌కు పూర్వవైభవం..



పూర్వపు రైతుబజార్(ఫైల్) (ఇన్‌సెట్) కూరగాయల విక్రయాలు(ఫైల్)

● పునర్నిర్మాణ పనులను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
● రూ. 41.50 లక్షలతో షెడ్లు, ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం

ఖమ్మంవ్యవసాయం: రైతుల అభ్యర్థన మేరకు ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలో భక్త రామదాసు కళాక్షేత్రం పక్కన ఉన్న పూర్వపు రైతుబజార్‌ను పునర్నిర్మిస్తున్నారు. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ. 41.50 లక్షలతో నిర్మించే రైతు బజార్ షెడ్లు, ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

జిల్లాల్లో తొలిసారిగా..

ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు సౌకర్యవంతంగా నగరం నడిబొడ్డున 1999 జనవరిలో రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో తొలిసారిగా ఏర్పాటు చేసిన రైతుబజార్ ఇదే. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, చింతకాని, బోనకల్, కామేపల్లి, కొణిజర్ల, కారేపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, డోర్నకల్, కురవి మండలాలకు చెందిన రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలు ఈ రైతు బజార్‌కు తీసుకొచ్చి విక్రయించుకునేవారు. ఈ రైతుబజార్‌లో రైతులే కూరగాయలు, ఆకుకూరలను విక్రయిస్తారనే పేరుంది.

పార్కింగ్ లేక..

రైతుబజార్ కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉండేది. అయితే ఇది ఆర్డీఓ ఆఫీస్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భక్త రామదాసు కళాక్షేత్రం, పెవిలియన్ గ్రౌండ్‌ల మధ్య ఉండడంతో రైతుబజార్‌కు వచ్చే వినియోగదారుల వాహనాలకు పార్కింగ్ లేకపోవడంతో రహదారిపైనే పార్కింగ్ చేయాల్సి వచ్చేది. దీంతో ఇబ్బందులు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో సమీకృత రైతు బజార్, మార్కెట్ల వ్యవస్థ వచ్చింది. ఖమ్మం కార్పొరేషన్‌గా ఎదగడంతో నగరంలో రెండు సమీకృత మార్కెట్ల నిర్మాణానికి అవకాశం కలిగింది. దీంతో పాత రైతుబజార్‌ను మూసివేసి ఖమ్మం బైపాస్ రోడ్‌లో నూతన బస్టాండ్ పక్కన సమీకృత మార్కెట్‌ను నిర్మించారు. ఇల్లెందు క్రాస్ రోడ్‌లో ఉన్న రైతు బజార్‌ను తొలగించి వీడీవోస్ కాలనీలో మరో సమీకృత మార్కెట్‌ను నిర్మించారు. అయితే ఈ రెండు సమీకృత మార్కెట్లు రైతులకు ఆశించిన ఫలితాలను ఇవ్వటం లేదు. వినియోగదారులు ఈ మార్కెట్లను అంతగా ఆదరించటం లేదు.

రైతుల అభ్యర్థనతో..

ఈ క్రమంలోనే రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రైతులు తమకు పూర్వపు రైతుబజార్‌ను కేటాయించాలని మంత్రి తుమ్మలను అభ్యర్థించారు. దీనికి మంత్రి స్పందించి రైతులకు అనుకూలంగా పాత రైతుబజార్‌ను పునఃప్రారంభించాలని అధికారులను ఆదేశించి, నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. అయితే ఇక్కడ పార్కింగ్ సమస్యకు కూడా పరిష్కారం కలిగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. రైతుబజార్ పునర్నిర్మాణం పట్ల ఉద్యాన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

హామీల అమలుకు కృషి

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
● మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఖమ్మంఅర్బన్: నగరంలో విలీనమైన, నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రి, కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ వైఎస్‌ఆర్ నగర్ కాలనీలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.4.10 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను నిలబెట్టే దిశగా ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు తెచ్చామని, దీంతో గత ఐదేళ్ల కాలంలో జరిగిన అరాచకాలపై విచారించి న్యాయంగా ఉన్న వారికి తప్పనిసరిగా వసతులు కల్పిస్తామన్నారు. వైఎస్‌ఆర్ కాలనీ సమస్యల పరిష్కారంతో పాటు కాలనీవాసుల అభ్యర్థన మేరకు ఎస్‌ఆర్‌గార్డెన్స్ వద్ద రిక్వెస్ట్ బస్టాప్, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని, వైఎస్‌ఆర్ నగర్ కాలనీ వైపు నుంచి రఘునాథపాలెం మండలానికి వెళ్లే రోడ్డులో బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రి ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఆర్డీఓ నరసింహారావు, కార్పొరేటర్లు లకావత్ సైదులు, కమర్తపు మురళీ, మలీదు వెంకటేశ్వర్లు, కొత్తపల్లి నీరజ, జిల్లా యువజన, క్రీడా సంక్షేమ శాఖ అధికారి సునీల్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సాధు రమేష్‌రెడ్డి, బోడా శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

గ్రానైట్ సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో గ్రానైట్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ నేతలు మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. గ్రానైట్ పరిశ్రమలకు రావాల్సిన సబ్సిడీలను ఇప్పించాలని, క్వారీ లీజులు సులభతరం చేయాలని, శ్లాబు విధానం తదితర సమస్యలను పరిష్కరించి గ్రానైట్ పరిశ్రమలను బతికించాలని వినతిలో పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో ది ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాటిబండ్ల యుగంధర్, కమర్తపు గోపాలరావు, కోశాధికారి పరమేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్‌బాబు, గ్రానైట్ అసోసియేషన్ నేతలు పుసులూరి నరేందర్, కిషన్‌రావు, చావా రామ్మూర్తి, తమ్మినేని సాగర్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఆశా వర్కర్ల వేతనం పెంచాలి

ఖమ్మంరూరల్: ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన రూ.18వేలు నెలవారీ వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎం వెంకటాయపాలెంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ బాలకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బి.మల్లేశ్వరి, సూరమ్మ, ఉష, ఉమా, సజాత, సావిత్రి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఖమ్మం సహకారనగర్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులు తక్షణమే విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మెడికల్ అడిషనల్ డైరెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రీయింబర్స్‌మెంట్ బిల్లులు రాక 15 నుంచి 18 నెలలు అవుతున్నా నేటికి మంజూరు చేయలేదన్నారు. అదనపు సిబ్బందిని వినియోగించుకుని అయినా సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.రత్నకుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో మంత్రి పొంగులేటి భేటీ

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో మంగళవారం భేటీ అయ్యారు. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న పథకాలపై ఇరువురు చర్చించారు. పనులను వేగవంతం చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు.

పరామర్శలు..

ఖమ్మంరూరల్/ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంరూరల్ మండలంలోని శ్రీసిటీకి చెందిన గరికపాటి వెంకట్రావు, ఆంజనేయప్రసాద్ సోదరుల తండ్రి గరికపాటి రాఘవయ్య(95) ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించి రాఘవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, బండి జగదీష్, స్వర్ణకుమారి, తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.అలాగే అమెరికాలోని చికాగో నగరంలో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన నూకారపు సాయితేజ కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించి సంఘటన పూర్వపరాలను అడిగితెలుసుకున్నారు. మంత్రి వెంట మద్దినేని బేబీ స్వర్ణకుమారి, తుళ్లూరు బ్రహ్మయ్య, రాజశేఖర్, నాగండ్ల నరేందర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఖమ్మంమయూరిసెంటర్: అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం కేఎంసీ శానిటేషన్ కార్మికులు, మెప్మా ఆర్పీలు, సిబ్బందితో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి కేఎంసీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ భువనగిరి శ్రీనివాసరావుతో కలిసి మేయర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కేఎంసీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజ్‌లు, బూట్లు, జాకెట్లతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం కేఎంసీ కార్యాలయంలో మహిళ సంఘాల సభ్యులు తయారు చేసిన పలు వస్తువులు, దుస్తులు, పచ్చళ్ల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం అయిందని, ఈ ఏడాది పాలనలో అనేక విజయాలను సాధించామన్నారు. ఈ నెల 9 వరకు జరిగే ప్రజాపాలన విజయోత్సవాలను నగరంలో ప్రణాళిక ప్రకారం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రణాళికలు లేకుండానే..

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు, మెడికల్ క్యాంపు, మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శనను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే పారిశుద్ధ్య కార్మికులకు అందించాల్సిన కిట్లను పూర్తిస్థాయిలో అందలేదని, వైద్య శిబిరం వద్ద కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకునేలా వారికి అవగాహన కల్పించలేకపోయారు. మరోపక్క కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం లేకుండా అధికారులు ఉత్సవాలు జరుపుకుంటున్నారని పలువురు కార్పొరేటర్లు విమర్శలు చేశారు. మెప్మా అధికారులకు ప్రజాప్రతినిధులు అంటే కనీసం గౌరవం కూడా ఉండడం లేదని, చిన్న మేసెజ్ కూడా పెట్టలేని స్థితిలో ఉన్నారని ఓ కార్పొరేటర్ సీడీఎంఏ జేడీ వద్ద వాపోయారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, మెప్మా పీడీ మహేందర్, మెప్మా అధికారులు సుజాత, శానిటరీ సూపర్‌వైజర్, ఎస్‌ఐలు, జావన్‌లు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ, సీడీఎంఏ జేడీ శ్రీనివాసరావు

రైల్వే అండర్ బ్రిడ్జి పరిశీలన

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని సారథినగర్ ప్రాంతంలో నిర్మాణమై ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని మంత్రి తుమ్మల సూచన మేరకు మంగళవారం నగర మేయర్ నీరజతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. మంత్రి తుమ్మల బ్రిడ్జిని ప్రారంభించనున్న నేపథ్యాన పరిశీలించినట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధు రమేష్‌రెడ్డి, ఎర్రం బాలగంగాధర తిలక్, కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, నాళం సతీష్, రంజిత్, తుపాకుల మధు తదితరులున్నారు.

యాసంగి వరి నారుమడుల పరిశీలన

కామేపల్లి: కామేపల్లిలోని యాసంగి వరి నారుమడులను మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చలి ప్రభావం నుంచి నారుమడులను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను రైతులకు ఏఓ వివరించారు. సాయంత్రం సమయంలో నీరు ఉంచి ఉదయం పూట నీటిని తీసివేయాలని, జింక్ లోప లక్షణాలు కనిపిస్తే జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు అజ్మీరా రాందాస్‌నాయక్, అజ్మీరా అర్జున్, కొర్ర రాములు, భూక్యా సీతారాం తదితరులు పాల్గొన్నారు.



వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ తారాదేవి

'విద్యాశాఖలో విలీనమే లక్ష్యం..'

ఖమ్మంఅర్బన్: కాంట్రాక్టు పద్ధతిలో విద్యాశాఖలో పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల రెండు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండవ రోజూ నిరసన చేపట్టారు. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లోని పాఠశాలలు, క్లస్టర్లు, మండల, జిల్లా స్థాయి కార్యాలయాలు, కేజీబీవీల ఉద్యోగులు ఖమ్మం అర్బన్ ఎంఈఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా 'విద్యాశాఖలో విలీనమే మా లక్ష్యం, రెగ్యులరైజే మా పంతం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తామని చెప్పిన వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు కె.అనిల్‌కుమార్, షేక్ ఇస్మాయిల్, రమాదేవి, ఎం.చైతన్యకుమార్, బి.రాంసింగ్ నాయక్, ఎండీ అజీజ్‌అహ్మద్, ఎన్.రామలింగం, కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా ఉద్యోగుల నిరసనకు అర్బన్ ఎంఈఓ కేవీ శైలజాలక్ష్మి, రఘునాథపాలెం మండల పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం కేశవరావు, తుమాటి సైదుబాబు, తిరుపతిరావు, వెంకటేశ్వర్లు, తదితరులు మద్దతు ప్రకటించారు.

మంద కృష్ణ వ్యాఖ్యలు సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలు సరైంది కాదని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాల మహానాడు గౌరవ సలహాదారుడు లింగాల రవికుమార్ ఖండించారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో వివేక్ రాజీలేని పోరాటం చేశారని అన్నారు. ఈ సమావేశంలో నాగేశ్వరరావు, ఎర్ర గంగాధర్, దుంపల వినోద్, క్రాంతికుమార్, దారా ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హిందూ ధర్మ రక్ష సమితి ర్యాలీ

ఖమ్మంగాంధీచౌక్: బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకు బుధవారం నగరంలో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధి అల్లిక అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ ధార్మిక సంఘాలు, దేవస్థాన కమిటీలు, గణేష్ మండప నిర్వాహకులు, అయ్యప్ప భక్త బృందం, పీఠాల నిర్వాహకులు తదితరులు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ వద్ద ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని, ఈ ర్యాలీ సర్దార్ పటేల్ స్టేడియం వరకు సాగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా సబ్‌స్టేషన్ పరిధి ఫీడర్‌లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏదులాపురం ఏఈ ప్రభాకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పెదతండాలోని సాయిప్రభాత్‌నగర్, టీచర్స్ కాలనీ, బీబీఎం స్కూల్ రోడ్, ఆర్ఎస్‌నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

దివ్యాంగులకు సన్మానం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని దివ్యాంగుల ఆత్మగౌరవ భవనం వద్ద దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులను నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వారికి భవన నిర్మాణం కోసం మంత్రి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, సంఘం నాయకులు రామకృష్ణ, గడుపూడి భాస్కర్‌రావు, కొరివి వీరన్న, లక్ష్మి, రామారావు, పి.స్వామి, పిల్లి నాగరాజు, నాగేశ్వరరావు, తిరపమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

☞ 8న సీపీఎం ఖమ్మం డివిజన్ మహాసభ..

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం నిర్మాణంలో వచ్చిన మార్పుల ఆధారంగా తిరిగి ఖమ్మం జిల్లాలో పార్టీ డివిజన్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని విజ్ఞాన స్కూల్‌లో జరిగిన పార్టీ వన్‌టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బోనకల్ రోడ్డు సెయింట్ మేరీస్ స్కూల్‌లో ఈ నెల 8న ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ డివిజన్ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈమేరకు ప్రజల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో పార్టీ బలమైన ఉద్యమాలు నిర్వహించేలా పార్టీ కమిటీలను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే మండల, టౌన్ కమిటీల మహాసభలు పూర్తయ్యాయని, కొత్త కమిటీలను నియమించబడినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బార్, వన్‌టౌన్ కార్యదర్శి నాగులు మీరా తదితరులు పాల్గొన్నారు.

☞ 12న పాలేరు డివిజన్ మహాసభ..

తిరుమలాయపాలెం: ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురంలో ఈ నెల 12న జరిగే సీపీఎం పాలేరు డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం తిరుమలాయపాలెంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న సీపీఎం ఈ మహాసభలలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, ముత్తయ్య, నగేష్, స్వాతిముత్యం, కొమ్ము నాగేశ్వరరావు, ఏపూరి నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు పెంచాలని ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలకు ఉచిత ప్రయాణం పేరిట ప్రభుత్వం ప్రకటించిన పథకం నీరుగారిపోతుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్, బందెల వెంకయ్య అన్నారు. మంగళవారం నగరంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళా జనాభాకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని, కాలం తీరిన బస్సుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు మాస్‌లైన్ ఆధ్వర్యాన వచ్చే బుధవారం జిల్లాలోని బస్ డిపోల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు గతంలో ఉన్న పల్లె వెలుగు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మలీదు నాగేశ్వరరావు, ఝాన్సీ, మంగతాయి, కె.శ్రీను, శోభ, రాకేష్, అప్పారావు, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం'

కూసుమంచి: మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ విమర్శించారు. మంగళవారం కూసుమంచిలో నిర్వహించిన ఐద్వా మండల మహాసభలో వారు మాట్లాడారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళలపై దాడులు నిత్యం కొనసాగుతున్నా ఏమాత్రం నివారించలేకపోతున్నారని, మానవ మృగాలకు ప్రభుత్వాలే అండగా నిలుస్తుండడం సిగ్గుచేటన్నారు. మహిళలు సంఘటితమై తమను తాము రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మద్యం మహమ్మారిని పారదోలేందుకు మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐద్వా మండల నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా చీర్ల రాధమ్మ, కందుల విజయను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, పండ్యాల సుమతీ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుతో కలవరం..!

భారీ వర్షాలు, వరదలతో కొట్టుకుపోయిన సుబ్లేడు–మరిపెడబంగ్లా రహదారికి మరమ్మతులు చేసి రవాణా సౌకర్యాలు పునరుద్ధరించినప్పటికీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం మరిచారు. కల్వర్టు తెగిపోయిన సమయాన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈనేపథ్యాన గతంలో ఓ మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు అందులో పడి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా.. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఇకనైనా కల్వర్టు వద్ద రహదారికి ఇరువైపులా రేడియం స్టిక్కర్లతో రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– తిరుమలాయపాలెం



ప్రమాదకరంగా మారిన కల్వర్టు